ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

బుధవారం 11 సెప్టెంబరు 2024



భూసేకరణ అభ్యంతరాలను పరిష్కరించాలి 8లో..

లాభాల వాటా 38శాతం ఇవ్వాలి 8లో..

చెరువుల ఆక్రమణలపై సీరియస్



రియల్ వెంచర్ ప్రహరీని తొలగిస్తున్న సిబ్బంది

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలపై ఫిర్యాదులు
- ఫిర్యాదులు రాకున్నా పరిశీలిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)


జిల్లాలో చెరువులు, కుంటలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల విషయంలో జిల్లా అధికార యంత్రాంగం సీరియస్‌గా వ్యవహరిస్తున్నది. ఫిర్యాదులు కూడా వస్తుండడంతో ఆ మేరకు వెంటవెంటనే చర్యలకు ఉపక్రమిస్తున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను వెలికి తీసేందుకు ప్రభుత్వం తీసుకవచ్చిన హైడ్రా గడగడలాడిస్తున్నది. చెరువులు, కుంటల ఫుల్ ట్యాంక్ లెవెల్(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లలో చేపట్టిన నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. వారం రోజుల క్రితం ఖమ్మం, మహబూబాబాద్‌లో వచ్చిన వరదల సందర్భంగా ఆ జిల్లాలను సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల్లోనూ హైడ్రా తరహాలో చెరువులు, కుంటలు, నాలాలపై చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. దీంతో అలర్ట్ అయిన కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆ మరుసటి రోజే పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బంధంకుంట చెరువు బఫర్ జోన్‌ను ఆక్రమించి కంపౌండ్ గోడ నిర్మాణాన్ని చేపట్టారని రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సర్వే చేసి గుర్తించారు. బఫర్ జోన్‌లో ఎంతవరకైతే గోడను నిర్మించారో ఆ మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు జేసీబీ సహాయంతో నేలమట్టం చేశారు.

గుండమ్మ చెరువులో స్వచ్ఛందంగా ప్రహరీ తొలగింపు..

పెద్దపల్లి పట్టణంలోని గుండమ్మ చెరువులోనూ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను ఆక్రమించి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక కౌన్సిలర్ వెంచర్‌ను ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మించారని బీజేపీ నాయకుడు ఒకరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువును ఆనుకుని చందపల్లి వైపు సర్వే నంబర్‌లో 1100లో 32 గుంటల వెంచర్‌ను ఏర్పాటు చేశారు. చెరువు లోపలికి కొంత చొచ్చుకుని వెళ్లి కంపౌండ్ నిర్మాణం చేపట్టారు. కంపౌండ్‌ను కూల్చేందుకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేస్తున్నదని సమాచారం తెలుసుకున్న సదరు నాయకుడు సోమవారం ప్రహరీని స్వయంగా తొలగించడం గమనార్హం. వాస్తవానికి ఇంకా రెవెన్యూ, నీటి పారుదల శాఖాధికారులు, సర్వేయర్ అక్కడికి చేరుకోలేదు. వాళ్లు వచ్చి కొలతలు తీసేలోపే కంపౌండ్‌ను తొలగించారు. కానీ పిల్లర్లు ఇంకా అక్కడే ఉన్నాయి. సర్వేయర్ సర్వే చేసి కొలతలు తీస్తే ఏ మేరకు ఆక్రమణకు గురయ్యిందని తేలనున్నది. ప్రస్తుతం చెరువులో నిండుగా నీరు ఉండడంతో కాంగ్రెస్ నాయకుడు నిర్మించిన కంపౌండ్ వాల్‌కు పక్కనే నీళ్లు వచ్చాయంటే ఎంతో కొంత భూమి ఆక్రమణకు గురైనట్లుగా స్పష్టంగా తెలుస్తున్నది. బుధవారం సంబంధిత అధికారులు చెరువును సందర్శించి కొలతలు తీసే అవకాశాలున్నాయి.

సుల్తానాబాద్, మంథని, రామగుండం ప్రాంతంలోనూ..

జిల్లాలోని సుల్తానాబాద్, మంథని, రామగుండం ప్రాంతంలో కూడా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు ఉన్నట్లుగా అధికారులకు పలువురు ఫిర్యాదులు చేశారు. ఆ మేరకు వాటిని ముందుగా గూగుల్ మ్యాప్‌ల ఆధారంగా పరిశీలించి, ఆ తర్వాత క్షేత్రస్థాయికి కూడా వెళుతున్నారు. కొన్ని చెరువులు, కుంటలకు సంబంధించిన మ్యాప్‌లు లభ్యం కావడం లేదని తెలుస్తున్నది. భూములకు సంబంధించిన సెత్వార్‌లను పరిశీలించాలని అధికారులు భావిస్తున్నారని సమాచారం. ఫిర్యాదుల ఆధారంగానే గాకుండా పట్టణాలు, మండల కేంద్రాల్లో గల చెరువులు, కుంటల్లో ఏమైనా అక్రమ నిర్మాణాలు, ఇతరత్రా ఆక్రమణలు ఉన్నాయా, లేదా పరిశీలించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించడంతో పరిశీలన చేపట్టారు. 2019 తెలంగాణ మున్సిపల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ చట్టం, సెక్షన్ 238 ప్రకారం 25 ఎకరాలకు పైగా శిఖం గల చెరువులు, కుంటలకు 30 మీటర్ల వరకు బఫర్ జోన్, 25 ఎకరాల్లోపు చెరువులు, కుంటలకు 9 మీటర్ల బఫర్ జోన్, 10 మీటర్ల వెడల్పు గల నాలాలకు ఇరుపక్కలా 9 మీటర్ల బఫర్ జోన్, 10 మీటర్ల లోపు నాలాలకు ఇరు పక్కలా 2 మీటర్ల బఫర్ జోన్ నిర్ధారించారు. అంతకు ముందు కూడా ఇవే నిబంధనలు ఉన్నప్పటికీ బఫర్ జోన్లను కాస్త పెంచారు. వీటి ఆధారంగా అధికారులు ముందుకు సాగుతున్నారు.



రియల్ వెంచర్ కంపౌండ్ తొలగించిన తరువాత..

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



ప్రమాణం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 10: స్థానిక అమర్‌చంద్ కల్యాణ మండపంలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు బోర్లకుంట వెంకటేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, గోమాస శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, సంక్షేమ పథకాలను, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. ఆర్మూర్ల పోశం, చల్ల నారాయణ రెడ్డి, కందుల సంధ్యారాణి, సోమవరపు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కల్వచర్ల విద్యార్థులు ఎంపిక



హరీశ్‌చంద్రప్రసాద్, కార్తికేయ

రామగిరి సెప్టెంబరు 10: మండలంలోని కల్వచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏ.హరిశ్చంద్రప్రసాద్, డి.కార్తికేయ ఈనెల 14 నుంచి నిర్మల్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానాచార్యులు టి.శోభన్‌రావు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బొనగాని హారిక, ఫిజికల్ డైరెక్టర్ కే.సతీష్, ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

శాంతియుత వాతావరణంలో శోభాయాత్ర : సీపీ

కోల్‌సిటీ, సెప్టెంబరు 10: రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలో గణేశ్ ఉత్సవాలను, నిమజ్జన శోభాయాత్ర అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్న రామగుండం సీపీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 2405 గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేశారని, ముందస్తు పటిష్ట చర్యలలో భాగంగా ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ అన్ని వినాయక మండపాల ప్రతిమలకు జియో ట్యాగింగ్ అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. నిమజ్జనం రోజు తీసుకోవాల్సిన నిబంధనలు, ఆంక్షలు పాటించాలని, గొడవలు, అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా శాంతియుత వాతావరణలో శోభాయాత్ర సాగేలా పోలీసులకు సహకరించాలని కోరారు.

జాతీయ నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

సుల్తానాబాద్, సెప్టెంబరు 10:జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవన ఆవరణలో పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మండలంలోని ఆటోలకు అవగాహన స్టిక్కర్లను అంటించారు. ముఖ్యఅతిథిగా సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐలు శ్రవణ్ కుమార్, వేణుగోపాల్ హాజరై మాట్లాడుతూ ఒక్కరి నేత్రదానం వలన ఇద్దరు అందులకు చూపును అందించవచ్చన్నారు. క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్, జిల్లా కో-ఆర్డినేటర్లు వలస నీలయ్య, మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్ సభ్యులు పూసాల సాంబమూర్తి, చకిలం వెంకటేశ్వర్లు, నాగమల్ల ప్రశాంత్ కుమార్, ఏనుగు నరేందర్‌రెడ్డి, దేవల్ల నరేందర్, ఎర్రబెల్లి సుధీర్‌రావు పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు, పోక్సో చట్టలాపై అవగాహన

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 10 : జిల్లాలోని రంగంపల్లి మైనారిటీ కళాశాలలో జిల్లా మహిళా సాధికరిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికరిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ చంద్రు, స్వప్న, ఫైనాన్స్ లిటరసీ సంధ్యారాణి మాట్లాడుతూ ఆడపిల్లల భద్రత కోసం ప్రభుత్వం సఖి కేంద్రం, భరోసా, షీ టీం వంటివి ఏర్పాటు చేసిందని వివరించారు. అలాగే వివిధ హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. అనంతరం కమాన్‌రోడ్ ఎంపీపీఎస్ పాఠశాలకు హాజరై అక్కడి పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, ఎమ్‌పిపిఎస్ హెడ్‌మాస్టర్ మనోహర్‌రావ్, షీటీం ఇన్‌చార్జి, ఏఎస్ఐ మల్లన్న, షీటీం సభ్యులు స్నేహలత, సంతోష్, భరోసా కోఆర్డినేటర్ అశ్రీత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీక చాకలి ఐలమ్మ

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 10: తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా వీరవనిత చాకలి ఐలమ్మ నిలుస్తుందని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీక అని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేసి వీర వనితగా చరిత్రలో నిలిచిపోయారని, ఆమెను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంఘ సేవకురాలుగా,భూమి, భుక్తి కోసం, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాటపటిమ స్ఫూర్తిదాయకం అని, ఆమె ఆశయాలను కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి అనిల్‌కుమార్, రజక సంఘ నాయకులు, అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుడా ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వండి

- అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు - అభివృద్ధి పనులను నెలరోజుల్లో ప్రారంభించాలి - కలెక్టర్ శ్రీహర్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

కోల్‌సిటీ, సెప్టెంబరు 10: రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ఏర్పాటుగల సాధ్యాసాధ్యాలపై పరిశీలించి నివేదిక అందజేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలోని అనుమతి లేని నిర్మాణాలను గుర్తించి నివేదిక సిద్ధం చేయాలని, చట్టపరంగా వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్పొరేషన్‌లో పన్నుల వసూళ్లు మరింత మెరుగుపరచాలన్నారు. టీయూఎఫ్ఐడీసీ, అమృత్ నిధలతో చేపట్టనున్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో ప్రారంభమైన సెంట్రల్ లైటింగ్ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్లు, మురుగు కాలువలు, జంక్షన్ల అభివృద్ధి పనులను అక్టోబరు నాటికి ప్రారంభించాలన్నారు. అమృత్ పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో కమిషనర్ శ్రీకాంత్, ఎస్ఈ శివానంద, వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.

డీ-ఎడిక్షన్ సెంటర్‌ను వినియోగించుకోవాలి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 10: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-ఎడిక్షన్ సెంటర్‌ను రోగులు, ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 10 పడకలతో ఏర్పాటు చేసిన డీ-ఎడిక్షన్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి 15రోజుల పాటు ప్రత్యేక చికిత్స అందించనున్నారని, మత్తు నుంచి శాశ్వత విముక్తి కలిగేలా చికిత్స అందించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం భవిత సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్ దివ్యాంగుల పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు.

మొగల్ పహాడ్ భూములు పరిశీలించిన కలెక్టర్

అంతర్గాం, సెప్టెంబరు 10: మండల పరిధిలోని మొగల్‌పహాడ్ (పాతరాజాపూర్) భూములను మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించచారు. మొగల్‌పహాడ్‌కు చెందిన రైతులకు సంబంధించి 606 ఎకరాల భూముల్లో ఎన్‌టీపీసీ యాష్‌పాండ్ నిర్మించనున్న నేపథ్యంలో ఎన్‌టీపీసీ ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ భూములను పరిశీలించారు. భూసేకరణలో విషయంలో రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను పారదర్శంగా పరిష్కరించాలని పెద్దపల్లి ఆర్‌డీవో గంగయ్య, అంతర్గాం తహసీల్దార్ రమేష్‌లను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ రామగుండం పట్టణంలోని భవిత కేంద్రాన్ని సందర్శించి అక్కడి దివ్యాంగుల విద్యార్థులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐకేపీ మండల సమాఖ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీమాన్, శ్రీనివాస్, భవిత అధికారి సునీత, ఎన్‌టీపీసీ అధికారులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీపాద ఎల్లంపల్లికి తగ్గిన ఇన్‌ఫ్లో

పెద్దపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రంవరకు 11,397 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో 4 గేట్ల ద్వారా 11,156 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 19.619 టీఎంసీల నీళ్లు వస్తున్నాయి.

పౌల్ట్రీఫామ్ యూనిట్ల గ్రౌండింగ్ చేపట్టాలి : కలెక్టర్

పెద్దపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద జిల్లాలోని మహిళా సంఘాలతో పాడి పశువుల యూనిట్లు, పౌల్ట్రీ ఫామ్ యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ సహకారంతో ఏర్పాటు చేయాల్సిన వాణిజ్య యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాడి పశువుల యూనిట్లు, పౌల్ట్రీఫామ్ మొదలగు యూనిట్లను సంఘాల ద్వారా ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళా సంఘాలతో బల్క్ కూలింగ్ యూనిట్ల నిర్వహణకు గల అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. అదేవిధంగా పశుసంవర్ధక శాఖ పరిధిలో జిల్లాలోని పశువులకు చికిత్స సేవలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని, కృత్రిమ గర్భధారణ, అవసరమైన పశుగ్రాసం పెంపకం మొదలగు అంశాలు లక్ష్యాల మేరకు పూర్తిచేయాలని, జిల్లాలోని పశు ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో తెరిచి ఉంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో శ్రీధర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బీ శంకర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ..

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 10 : ప్రత్యేక అవసరాలు గల పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లో అధికారులతో భవిత సెంటర్ల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులపై శ్రద్ధ వహించి వారు భవిత కేంద్రాలకు వచ్చే విధంగా చూడాలని సూచించారు. ప్రతి మండల కేంద్రంలోని ఐఈఆర్‌పీలను మండలాల వారీగా సమీక్షించి వారి కేంద్రం పరిధిలోగల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు బోధనా పరికరాలు లేక బోధన కుంటు పడుతుందని గమనించిన కలెక్టర్ తన సొంత నిధుల నుంచి జిల్లాలోని 3 భవిత సెంటర్లకు, 14ఈఆర్‌సీలకు ఒక్కొక్క దానికి 30 వేల రూపాయలు ప్రత్యేక నిధుల నుంచి మంజూరుచేశారు. ఈ కేంద్రాలకు వచ్చే పిల్లలందరికీ సదరం సర్టిఫికెట్లు జారీ చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టు అధికారిని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సహిత విద్యా సమన్వయకర్త అజీమ్ దుబీర్, డి.శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే



టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 10:తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన బి. మహేష్‌కుమార్‌గౌడ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కు మార్, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సుల్తానాబాద్ మాజీ సర్పంచ్ అన్నయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు..

పెద్దపల్లి సర్కిల్‌ను సందర్శించిన ఎన్‌పీడీసీఎల్ సీఎండీ

పెద్దపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి సర్కిల్ పరిధిలోని పలు సబ్ స్టేషన్లను ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. మంథని పరిధిలోని ఆకెనపల్లి, ఖానాపూర్, ఎక్లాస్‌పూర్ సబ్‌స్టేషన్లను సందర్శించి రిపీటెడ్ ఫెయిల్యూర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. 11కేవీ ఫీడర్ ఆర్ఎఫ్‌సీఎల్‌ను, 33 కేవీ ఫీడర్ లిఫ్ట్ ఇరిగేషన్ బ్రాహ్మణపల్లి, మంథని ఈఆర్‌వో, డివిజన్ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం పెద్దపల్లిలో ఏఈలు, ఏడీఈలు, డీఈలతో సమీక్షా సమావేశం నిర్వహించి సర్కిల్ పురోగతికి కృషి చేయాలని సూచించారు. మీటింగులో ఎస్ఈ సుదర్శన్, ఏడీఈ టెక్నికల్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ టీచర్‌ను సన్మానించిన సీఎం రేవంత్‌రెడ్డి



సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మంథని, సెప్టెంబరు 10: ఢిల్లీలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా ఈనెల 5న అవార్డు అందుకున్న మంథని నియోజకవర్గానికి చెందిన తాడూరి సంపత్‌కుమార్ ప్రగతి భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మెమెంటో, శాలువాతో మంగళవారం ఘనంగా సన్మానించారు. మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్‌కు సన్నిహితుడు కావడంతో మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని తాడూరి సంపత్‌కుమార్ కలువగా ఆయన సన్మానించి అభినందించారు. 8వ కాలనీకి చెందిన సంతప్‌కుమార్ 15 ఏళ్లుగా జల్లారం పాఠశాలలో ఎస్ఏగా విధులు నిర్వహించి ఇటీవల సిరిసిల్ల జిల్లా దమ్మన్నపేట జడ్పీహెచ్ఎస్‌కు బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో సంపత్‌కుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు నమోదు చేయాలి

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 10 : ప్రస్తుత విద్యాసంవత్సరానికి ప్రతి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ అవార్డులకు 5 నామినేషన్లు నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.మాధవి తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్ నమోదు ప్రక్రియపై మంగళవారం కలెక్టరేట్‌లో ఉపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె హాజరై ప్రసంగించారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈనెల 15వ తేదీలోగా నాణ్యమైన సమాజహిత వినూత్న ఆవిష్కరణలతో నమోదును పూర్తిచేయాలన్నారు. అంతకుముందు భౌతిక, జీవశాస్త్ర జిల్లా ఫోరంల ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టి.సంపత్ కుమార్, జి.అంజన్ కుమార్, ఎం.రమేష్‌లను సన్మానించారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.ఎం.షేక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూ డిగ్రీ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10: శాతవాహన విశ్వ విద్యాలయం (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీఏఎల్) డిగ్రీ ఫస్ట్, సెకండ్, థర్డ్ ఇయర్ వైస్ ఎగ్జామ్ ఫీజు నోటిఫికేషన్ షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. విశ్వ విద్యాలయ పరిధిలోని విద్యార్థులు చదువుకునే కళాశాలకు వెళ్లి ఫీజు చెల్లించాలన్నారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థులు ఫస్ట్, సెకండ్ అండ్ థర్డ్ ఇయర్ ఫీజు నోటిఫికేషన్ యూనివర్సిటీ వెబ్ సైట్‌లో చూసుకోవచ్చని ఆయన సూచించారు.


ఇద్దరు దొంగల అరెస్టు

వేములవాడ రూరల్, సెప్టెంబరు 10: దొంగతనం జరిగిన 24 గంటల్లోగా నిందితులను పట్టుకున్నారు రూరల్ పోలీసులు. వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏఎస్పీ శేశాద్రినీరెడ్డి మంగళవారం సాయంత్రం వివరాలను వెల్లడించారు. మల్లారం గ్రామం రాజానగర్‌కు చెందిన శ్రీరాముల శ్రీనివాస్ తన ఇంటికి కలర్ వేయడానికి వేములవాడకు చెందిన సందెల్లి అనీల్, సయ్యద్ అఫ్రోజ్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. కొన్నిరోజులుగా ఇంటికి కలర్ వేసే పని జరుగుతున్న క్రమంలో ఆదివారం శ్రీనివాస్ భార్యతో కలిసి బెజ్జంకికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని హ్యాండ్ బ్యాగ్ కనబడలేదు. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బ్యాగ్‌లో 25 గ్రాముల బంగారం ఉన్నట్లు ఫిర్యాదులో తెలిపాడు. విచారణ చేపట్టిన రూరల్ ఎస్సై మారుతీ ఇంటికి కొద్ది దూరంలో బ్యాగును కనిపెట్టారు. బ్యాగుకు కలర్ మరకలు ఉండడంతో ఆ కోణంలో దర్యాప్తు చేశారు. కలర్ వేసిన అనీల్, అఫ్రోజ్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి బంగారం రికవరీ చేసి నిందితులను రిమాండుకు తరలించినట్లు ఏఎస్పీ శేశాద్రినీరెడ్డి తెలిపారు. సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందరూ.. అంత్యక్రియలకు..

మృతుడి ఇంట్లో దొంగతనం

మల్యాల, సెప్టెంబరు 10: మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలు నిర్వహించడానికి కుటుంబ సభ్యులు వెళ్లగా కాసేపటికే బంధువుగా చెప్పుకున్న వ్యక్తి ఒకరు మృతుడి ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. కొండగట్టుకు చెందిన గౌరపల్లి లక్ష్మన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు మధ్యాహ్నం వైకుంఠధామానికి వెళ్లారు. అయితే ఇంటి వద్ద పనులు చేయడానికి కొందరు బంధువులు ఉన్నారు. అందులో కలిసి పోయిన ఓ వ్యక్తిపై అక్కడి వారందరికీ అనుమానం రాగ తాను కూడా బంధువునని చెప్పుకున్నాడు. అంత్యక్రియలు చేసి వచ్చే వరకూ తాను కూడా ఇక్కడే ఉంటానని పనులు చేసే అక్కడి వారికి సహకరించాడు. ఇంటి శుద్ధి పనులు అయ్యాక అతను ఇంట్లోకి వెళ్లగా కాసేపటికి కోతుల గుంపు ఇంట్లోకి వెళ్లింది. బయట ఉన్న వ్యక్తులు వాటిని తరమడానికి ప్రయత్నించడాన్ని గమనించిన సదరు వ్యక్తి ఇంట్లో నుంచి కోతులను తరుముతూ బయటకు వచ్చి పారిపోయాడు. దీంతో అనుమానం వచ్చి మిగతా బంధువులు ఇంట్లోకి వెళ్లి చూసేసరికి మూడు బీరువాలు పగులగొట్టి అందులోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉండటాన్ని గమనించారు. అక్కడ ఉన్న సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. కోతులు రాకపోతే ఇంట్లో బంగారు ఆభరణాలు ఇతరత్రా ఎత్తుకెళ్లేవాడని స్థానికులు తెలిపారు. నిందితుడు ద్విచక్రవాహనంపై పారిపోయాడన్నారు.


ప్రమాదం జరిగిన బస్సు(ఫైల్)

మానని గాయం

సెప్టెంబరు 11.. కొండగట్టు ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన రోజు. ఆ బస్సులో ఉన్న వారంతా కొండగట్టు అంజన్నను దర్శించుకుని వస్తున్న వారే. పిల్లాపాపలతో కుటుంబ సభ్యులంతా కలిసి అంజన్న వద్ద మొక్కులు తీర్చుకుని ఇళ్లకు బయల్దేరాలని బస్సు ఎక్కి కూర్చున్నారు. బస్సు మొత్తం నిండుగా ఉంది. ఎవరి ముచ్చట్లలో వారు నిమగ్నమయ్యారు. కొండగట్టు నుంచి బస్సు దిగుతుండగా ఒక్కసారిగా అదుపుతప్పి లోయలో పడింది. అంతే అందులో ఉన్న ప్రయాణికులకు ఏం జరిగిందో తెలిసేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అప్పటి వరకు తమతో మాట్లాడిన కుటుంబ సభ్యులు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో కన్నీటి పర్యంతం అయ్యారు. ప్రమాదంలో 67 మంది వరకు చనిపోయారు. ఇంకొందరు తీవ్ర గాయాలపాలైన ఇప్పటికీ లేవలేని స్థితిలో ఉన్నారు. ప్రమాదం జరిగిన రోజును గుర్తు చేసుకుంటూ క్షతగాత్రులు ఇప్పటికీ కన్నీటి పర్యంతం అవుతున్నారు. అత్యంత విషాధకర ఘటన జరిగి ఆరేళ్లు అవుతోంది.

- కొండగట్టు బస్సు ప్రమాదంలో 67 మంది మృతి
- నేటికీ కలిచివేస్తున్న ఘటన
- బాధితులకు అందింది అరకొర సాయమే

మల్యాల, సెప్టెంబరు 10: కొండగట్టు ఘాట్‌రోడ్డుపై జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదానికి నేటికి ఆరు సంవత్సరాలు. ఈ ప్రమాదంలోని ప్రయాణికుల హాహాకారాలు.. క్షతగాత్రుల ఆర్తనాదాలు బంధువులతో పాటు స్థానికులను నేటికీ కలచి వేస్తున్నాయి. ఆనాటి ప్రమాద గుర్తులు కలవరపెడుతూనే ఉన్నాయి. ఈ సంఘట న దేశంలోనే అతిపెద్ద రహదారి ప్రమాదంగా నిలిచిపోగా.. సమారు 67 మంది వరకు మృత్యువాత పడ్డారు. ప్రమాదానికి కారణమైన ఈ ఘాట్‌రోడ్డుపై దిద్దుబాటు చర్యలు ఇప్పటి వరకు నామమాత్రమే.. ఘాట్‌రోడ్డు అలైన్‌మెంట్ సరిగా లేదని నిపుణులు పదేళ్లగా సూచిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో 2018 సెప్టెంబరు 11న కొండగట్టు గుట్టపై నుంచి ఆర్టీసీ బస్సు దిగుతుండగా అదుపుతప్పి లోయలో బోల్తాపడి 67మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 45మంది వరకు క్షతగాత్రులుగా మిగిలారు. ఈ ప్రమాదం అనంతరం ప్రస్తుత ఘాట్ రోడ్డును మూసివేశారు. వాహనాల రాకపోకలను నిషేదించారు. ఘాట్ రోడ్‌కు కొంతమేర మరమ్మతులు, కొన్ని చోట్ల రక్షణగోడల నిర్మాణం, స్పీడ్‌బ్రేకర్ల మరమ్మతులు మాత్రమే చేపట్టారు. శాశ్వతంగా ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు శూన్యం. గతంలోనూ ఈ ఘాట్ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు 150మందికి పైగానే భక్తులు దుర్మరణం చెందగా, వందలాదిగా గాయాలపాలయ్యారు. అయినప్పటికీ, ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు అంతంత మాత్రమే. రెండేళ్ల క్రితం నిబంధనల తో కూడిన షరతులతో వాహనాల రాకపోకలను ప్రారంభించిన అధికారులు పలు శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలనే ఈఎన్‌సీ ఆదేశాలను పాటించడం లేదు.


● బాధితులకు అందని సహాయం

ఘాట్‌రోడ్డు పక్కన గల లోయలో ఆర్టీసీ బస్సు పడి 67 మంది మృతి చెందగా మృతుల కుటుంబాలను కదిలిస్తే ఇప్పటికీ వారి కన్నీళ్లు వరదలుగా ప్రవహిస్తున్నాయి. మృతుల్లో 60మందికి పైగ కొడిమ్యాల మండలానికి చెందిన వారే ఉండగా వారికి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పరిహారం అందకపోగా తీవ్ర వేదనకు గురౌతున్నారు. ప్రమాదం అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో పాటు ఆర్టీసీ రూ. 10లక్షలు అందించి చేతులు దులుపు కున్నట్లు బాధిత కుటుంబాలు అంటున్నాయి. క్షతగాత్రులు అయిన అనేక మంది ఇప్పటికీ మంచానికే పరిమితం కాగ కనీసం ప్రభుత్వం అందించే పింఛన్‌కు కూడా నోచుకోవడం లేదు. ప్రభుత్వం మృతుల కుటంబాలకు, క్షతగాత్రులకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఆదుకోవల్సిన అవసరం ఉంది. అయితే ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఆ దశగా చర్యలు తీసుకోవడం లేదని బాధిత కుటంబాలు ఆవేధన వ్యక్తం చేస్తున్నాం


పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న ప్రమాదకారక బస్సు

● రాణా ముందే ఆర్టీసీ బస్సు..

ఘాట్‌రోడ్డుపై జరిగిన ప్రమాదంలో 67మంది మృతికి కారణమైన ఆర్టీసీ బస్సు మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగ ఇప్పటికీ అలాగే ఉంది. ప్రమాదానికి సాక్షాత్కారంగా నిలుస్తోంది. ప్రమాదం అనంతరం న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. బస్సు రిలీజ్‌కు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో బస్సును తీసుకెళ్లడం లేదు. దీంతో బస్సు పూర్తిగా తుప్పు పట్టిపోతోంది. పైగా ఇది వ్యవసాయ భూములకు వెళ్లే మార్గంలో ఉండడంతో ఈ మార్గంలో నడిచే రైతులు, ఇతరులు బస్సును చూసి నాటి ప్రమాదాన్ని గుర్తు తెచ్చుకుంటున్నారు. బస్సును అక్కడి నుంచి తొలగించాలని పోలీసులను కోరుతున్నారు.


కొండగట్టు ఘాట్‌రోడ్డు

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య


సాయిచరణ్


పోచయ్య (ఫైల్)

సారంగాపూర్, సెప్టెంబరు, 10: వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేక మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన యువకుడు జీవితం విరక్తి చెంది మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం పెంబట్ల గ్రామానికి చెందిన తేలు చంద్రయ్య పెద్ద కుమారుడు తేలు సాయి చరణ్(21) డిగ్రీ చదువుతున్నాడు. సాయి చరణ్‌కు తన స్నేహితులతో పాటు హోటల్ మేనేట్‌మెంట్ కోర్సు చేయాలనే బలమైన కోరిక ఉండేది. అందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డు వచ్చాయి. ఆ కోరిక నెరవేరలేదని మనస్తాపానికి గురై వారం రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన తల్లితండ్రులు చికిత్స నిమిత్తం జగిత్యాలలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. మళ్లీ కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. చరణ్ తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

శివంగాలపల్లిలో వృద్ధుడు..

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లి గ్రామంలో సోమవారం వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన మక్కపల్లి పోచయ్య (80) అనే వృద్ధుడు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం చేయించినప్పటికీ నయం కాకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు మక్కపల్లి పరుశురాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరు..

కరీంనగర్ క్రైం: బొమ్మకల్ గ్రామ పరిధిలోని హుస్సేనిపురకు చెందిర ఎండీ అక్బర్ (50) మంగళవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. కాగా అక్బర్‌కు దూరంగా పుట్టింటిలో ఉంటున్న అతడి మొదటి భార్య మున్నాబీ తన భర్త మరణంపై అనుమానాలున్నాయని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అక్బర్‌కు మున్నాబీతో వివాహం జరగగా వారికి ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడు. 6 నెలల కిందట భర్త కొట్టడంతో కూతుళ్లతో కలిసి పుట్టిళ్ల మేడిపల్లిలో ఉంటోంది. మొదటి భార్యకు తెలియకుండానే మరొక మహిళను వివాహం చేసుకుని కాపురం చేస్తున్నాడని, ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా తనకు సమాచారం అందించారని తెలిపారు. ఇంటికి వెళ్లి చూడగా చనిపోయాడని మొదటి భార్య మున్నాబీ ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త ఆత్మహత్యపై అనుమానాలున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 10 : పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురు వ్యక్తులను ఆరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి రూ.5,030 నగదు, 6 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని బసంత్‌నగర్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

మంథని, సెప్టెంబర్ 10: మున్సిపల్ పరిధిలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇనుముల సత్యనారాయణ అనే వ్యక్తిపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మందల మల్లారెడ్డి అనే వ్యక్తిని ఇనుముల సత్యనారాయణ రూ.5లక్షలు ఇవ్వాలని బెదిరించాడు. రెండు లక్షలు తీసుకొని మిగితా 3లక్షల కోసం గన్‌మెన్ అడ్డుపెట్టుకొని బెదిరింపులకు పాల్పడ్డాడు. మల్లారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో సైతం అనేక మందిని ఇలానే బెదిరింపులకు గురి చేసి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిశాడని ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

రేషన్ షాపులో బెదిరింపులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 10: గోదావరిఖని ఫైవింక్లయిన్‌లోని ఒక రేషన్‌షాపులో సోమవారం రాత్రి కొత్తపల్లి శివచరణ్ అనే వ్యక్తి చొరబడి తాను విలేకరినని, క్వింటాలున్నర బియ్యం కావాలంటూ బెదిరింపులకు పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. రాత్రి షాపులోకి వెళ్లి శివచరణ్ నిర్వాహకుడు శివరాత్రి సురేష్‌తో బియ్యం గురించి గొడవ పెట్టుకున్నాడన్నారు. తన వద్ద అంత బియ్యం లేవని సురేష్ పేర్కొనగా శివచరణ్ కోపంతో తాను పత్రికా విలేకరినని, బియ్యం ఇవ్వవా అంటూ మిషన్‌ను ధ్వంసం చేశాడని, అడ్డువెళ్లిన శివరాత్రి సురేష్‌పై దాడి చేశాడని, బియ్యం ఇవ్వకపోతే చంపుతానని బెదిరించాడని సీఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా సభ్యుల అరెస్టు

● 12 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం

జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద 12 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. డబ్బులు సులువుగా సంపాదించాలన్న ఆలోచనతో కొందరు ముఠాగా ఏర్పడి అంతరాష్ట్ర స్థాయిలో గంజాయి రవాణాకు పాల్పడడానికి నిర్ణయించుకున్నారు. ఆంధ్ర - ఒరిస్సా సరిహద్దు గ్రామాల నుంచి అక్రమంగా గంజాయిని తీసుకవచ్చి విక్రయిస్తున్నారు. జిల్లాలోని కొడిమ్యాల మండలం పూడూరు గ్రామానికి చెందిన ఎడమలపల్లి సాయి కుమార్, తుడుం సాయితేజ, కందుల అరుణ్, గౌరాపూర్ గ్రామానికి చెందిన ఎడపల్లి సాకేత్, జగిత్యాల మండలం దరూర్ గ్రామానికి చెందిన పాల రాజుకుమార్‌లను గంజాయి వ్యవహారంలో కొడిమ్యాల మండలం పూడూరు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఆంధ్రా- ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి పెట్టుబడి పెట్టి తక్కువ ధరలో గంజాయిని కొనుగోలు చేసి పూడూరుకు తరలించారన్నారు. గంజాయిని ముఠా సభ్యులు పంచుకోవడా నికి ప్రయత్నిస్తున్న తరుణంలో పక్కా సమాచారం మేరకు కొడిమ్యాల, మల్యాల సర్కిల్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద 12 కిలోల గంజాయి, రెండు ద్విచక్రవాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సంఘటనలో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కొడిమ్యాల ఎస్ఐ సందీప్, హెడ్ కానిస్టేబుల్ రాజయ్య, కానిస్టేబుల్స్ తిరుమల్ రాజు, వినోద్, మల్యాల సీఐ నీలం రవి, డీఎస్పీ రఘు చందర్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించి నగదు రివార్డు అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

బంగారు గొలుసు దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

జ్యోతినగర్, సెప్టెంబరు 10: ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 8న జరిగిన దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ నెల 1న లూర్దునగర్‌లో నివసిస్తున్న దొవతిరెడ్డి ప్రతాపరెడ్డి ఇంటి ముందు ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు హారన్ కొట్టారు. దీంతో ప్రతాప్ రెడ్డి బయటకు వచ్చి ఎందుకు హారన్ కొడుతున్నారని అడిగే ప్రయత్నంలో ఆటోలోని ముగ్గురు వ్యక్తులు ఆయన మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. దోపిడీ విషయాన్ని ప్రతాపరెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఎన్‌టీపీసీ మెటీరియల్ గేట్ వద్ద ఆటోలో వెళ్తున్న ముగ్గురు నిందితులు గోదావరిఖనికి చెందిన ఆతుకూరి శ్రీనివాస్, బెజ్జంకి పృథ్వీరాజ్, రేణిగుంట రవితేజను అరెస్టు చేసినట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి అపహరణకు గురైన రెండున్నర తులాల బంగారు గొలుసు, చోరీకి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకుని వారిని కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్సై ప్రవీణ్ పేర్కొన్నారు.

22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సైదాపూర్, సెప్టెంబరు 10: సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి, ఘన్పూర్ గ్రామాలలో అక్రమంగా నిల్వ ఉంచిన 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటింటికి తిరిగి రేషన్‌బియ్యం పోగుచేసి ఒకదగ్గర ఉంచి అక్కడి నుంచి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు వెన్కేపల్లి, ఘన్పూర్ గ్రామాలలో తన పోలీస్ సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేయగా రెండు గ్రామాలలో వేరువేరు చోట్ల అక్రమంగా నిలువ ఉంచిన 22క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించినట్లు తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకొని, వాటిని అక్రమంగా నిలువ ఉంచిన చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన పెద్ద భత్తుల కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తిరుపతి హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్

● ఆలయ విస్తరణకు ఏర్పాట్లు చేయాలని సూచించిన సీఎం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 10: శృంగేరి జగద్గురు ఇచ్చిన మహా ప్రసాదం, శృంగేరి పరంపర చిత్రపటాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబుల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం అందజేశారు. శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ పనులను ప్రారంభించడానికి శృంగేరి పీఠం వారి అనుమతులకు ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎంవో వేముల శ్రీనివాసుల బృందం సోమవారం శృంగేరి పీఠంను సందర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్‌బాబు, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు శృంగేరి పీఠం తెలంగాణ బాధ్యులు రాధాకృష్ణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి జగద్గురు భారతి తీర్థ మహాస్వాముల వారు, పీఠాధిపతి విధిశేఖర భారతి స్వాముల వారు ఇచ్చిన మహాప్రసాదాన్ని అందేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఆలయ విస్తరణ పనులపై సలహాలను, సందేహాలు నివృత్తి చేసిన తీరును వివరించారు. ఆలయ విస్తరణకు తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సంబంధిత అధికారులకు సీఎం సూచించారు.


సీఎంకు చిత్రపటాన్ని అందజేస్తున్న మంత్రులు, ప్రభుత్వ విప్

ఉచిత విద్య అందించడంలో ప్రభుత్వాలు విఫలం

● పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 10: ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంగిడికుమార్, ముల్కల తిరుపతి విమర్శించారు. మంగళవారం నగరంలో ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 30న జార్జిరెడ్డి యాభై సంవత్సరాల సభను విజయవంతం చేయాలన్నారు. భారత విప్లవ విద్యార్థి ఉద్యమ చరిత్రలో పీడీఎస్‌యూ ప్రత్యేక చరిత్ర కలిగి ఉన్నదన్నారు. శాస్త్రీయ విద్యా విధానం కోసం జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్, శ్రీపాదశ్రీహరి, కోల శంకర్, దుస్స చేరాలు, బొమ్మ సాంబయ్య, రంగవల్లి, మారోజు వీరన్న లాంటివీరులు అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు కెస్వప్న, లోకిని రమేష్, రాజశేఖర్, వర్షిని, శైలజ, రజనీకాంత్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో సీఐడీ విచారణ

● ఆసుపత్రిలో సీఎంఆర్ఎఫ్ బిల్లులు తనిఖీ చేసిన అధికారులు

జమ్మికుంట, సెప్టెంబర్ 10: జమ్మికుంట పట్టణంలోని పాత అంబేద్కర్ చౌరస్తాలో గల సప్తగిరి ఆసుపత్రిలో జరిగిన సీఎమ్ఆర్ఎఫ్ బిల్లుల అక్రమాలపై తెలంగాణ సీఐడీ పోలీసులు మంగళవారం విచారణ చేపట్టారు. ఇదే ఘటనపై ఏడాది క్రితం అధికారులు ఆసుపత్రిలో తనిఖీలు జరిపారు. ఆగస్టు 26న సీఐడీ పోలీస్‌లు ఆసుపత్రికి వచ్చారనే సమాచారం అందుకున్న మీడియా అక్కడకు పెద్ద ఎత్తున చేరుకుంది. కానీ సీఐడీ అధికారులు ఎవరు అటువైపు రాలేదు. మంగళవారం కూడా సీఐడీ అధికారులు విచారణకు వచ్చారనే విషయం తెలుసుకున్న మీడియా ఆసుపత్రికి చేరుకుంది. అప్పటికే సీఐడీ అధికారులు వెళ్లిపోయారు. సప్తగిరి ఆసుపత్రి నుంచి ఒకే ఐడిపై రెండు సీఎమ్ఆర్ఎఫ్ బిల్లులు సృష్టించారు. ఫేక్ బిల్లులను గుర్తించిన అధికారులు ఆసుపత్రిపై కేసు నమోదు చేశారు. గతంలో ఆసుపత్రిలో పనిచేసిన సంతోష్ అనే వ్యక్తి బిళ్లలు తయారు చేశాడని వైద్యుడు వంశీకృష్ణ ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా సీఐడీ పోలీస్‌లు సదరు వ్యక్తితో పాటు వైద్యుడిని విచారించారు. ఫేక్ సిఎమ్ ఆర్ఎఫ్ బిళ్లలు ఎందుకు తయారు చేశారు... ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందని ప్రశ్నించారు. బిల్లులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆ ఫేక్ బిళ్లలు ఎలా వచ్చాయో తనకు తెలియదని, బిల్లులపై ఉన్న సంతకం కూడా తనది కాదని వైద్యుడు సమాధానం ఇవ్వగా, అసలు ఆ బిళ్లల సంగతే తనకు తెలియదని సంతోష్ తెలిపాడు. సీఐడీ పోలీస్‌లు మాత్రం బిళ్లలకు సంబంధించిన పలు రికార్డులు, పెన్‌డ్రైవ్‌లు తీసుకువెళ్లారు.

● సీఎమ్ఆర్ఎఫ్ బిల్లుల అక్రమాలపై అనుమానాలెన్నో?

సీఎమ్ఆర్ఎఫ్ బిల్లుల కోసం ఆసుపత్రి నుంచి చాలా పత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటికీ వైద్యుడికి సంబంధం లేకుండా బయటి వ్యక్తి తయారు చేయడం సాధ్యమేనా అన్న విషయంపై చర్చ జరుగుతోంది. సీఎం ఆర్ఎఫ్ కోసం ఆసుపత్రి నుంచి ఎమర్జెన్సీ సర్టిఫికెట్, ఎసెన్షియల్ సర్టిఫికెట్, డిశ్చార్జ్, ఇన్ పేషెంట్ ఐపి, ఇన్వెస్టిగేషన్, ఫార్మసీ, ల్యాబ్ తదితర బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. వీటన్నింటినీ ఆసుపత్రిలో పనిచేసే ఒక వ్యక్తి తయారు చేయడం సాధ్యం కాదనే చర్చ జరుగుతోంది.

ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి అనుకూలం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కరేనని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగార్డెన్‌లో ఎస్సీ వర్గీకరణపై సదస్సు నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు మాత్రమే ఇచ్చిందని, ఇంకా వర్గీకరణ అమలు కావాల్సి ఉందన్నారు. ఎస్సీ వర్గీకణ విషయంలో గత ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. ఈ అంశంలో బీజేపీకి ఓటేయాలని మందకృష్ణ చెప్పినా అత్యధిక మాదిగలు కాంగ్రెస్‌కే ఓటు వేశారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇప్పటివరకు కేవలం మన సీఎం రేవంత్‌రెడ్డి మాత్రమే చెప్పారని, బీజేపీ పాలిత ప్రాంత రాష్ట్రాల ముఖ్యమం త్రులు కాని, కేంద్రం కానీ ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో భారీ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గజ్జెల కాంతం

ఆస్తిలో వాటా కోసం భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

ఓదెల, సెప్టెంబరు 10: భర్త ఆస్తిలో వాటా కోసం మండలంలోని కొలనూర్‌లో మంగళవారం జంగ సంజీవరెడ్డి అనే వ్యక్తి ఇంటి ఎదుట అతడి భార్య వనజ, కూతురు శ్రీవర్ష బైఠాయించారు. బాధితురాలు విలేకరులతో మాట్లాడుతూ, సంజీవరెడ్డి మొదటి భార్య గతంలో మృతిచెందగా రెండో భార్యగా వీణవంక మండలం చల్లూర్‌కు చెందిన తనను వివాహం చేసుకున్నాడని తెలిపారు. కొద్ది రోజులైన తర్వాత ఆడపిల్లలు పుట్టారని చితకబాదుతూ చిత్రహింసలకు గురి చేసి ఇంటి నుంచి వెళ్లగొట్టారని, దీంతో తన తల్లి దగ్గర ఇద్దరు కూతుర్లతో బతుకుతున్నానని వనజ తెలిపారు. అనంతరం మరో మహిళను తీసుకువచ్చి కాపురం పెట్టాడని మూడో భార్యకు ఒక కుమారుడయ్యాడని తెలిపారు. మూడవ భార్య కుమారునికి 5 ఎకరాల భూమి పట్టా చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే ఇక మిగిలిన 6 ఎకరాల్లో మూడు ఎకరాల భూమిని తన కూతుర్లకు పట్టా చేయాలని డిమాండ్ చేశారు. ఇది పరిష్కారం అయ్యేవరకు ఇక్కడి నుంచి వెళ్లనని, అధికారులు స్పందించి, నా ఇంటిలో స్థానం కల్పించాలని డిమాండ్ చేసింది. ఇంటి ముందు భార్య, కూతురు బైఠాయించడంతో ప్రస్తుతం ఇంటికి తాళం వేసి సంజీవరెడ్డి, ఇతని మూడో భార్య, ఇద్దరు వృద్ధులు ఇక్కడి నుంచి పరారీ అయ్యారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 10: వ్యవసాయ మార్కెట్ ఎదురుగా రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

చిరుత దాడిలో గొర్రె మృతి

చందుర్తి, సెప్టెంబర్ 10: చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మంగళవారం చిరుత పులి దాడిలో ఓ గొర్రె మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దోకె రాజయ్య అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రెపై కొత్తకుంట సమీపంలో కర్షల బోరు వద్ద చిరుత పులి దాడి చేయడంతో గొర్రె మృతి చెందింది. గతంలో కూడా ఈ ప్రాంతంలో చిరుత దాడికి ఓ మేక మృతి చెందినట్లు తెలిపారు. చిరుతపులి దాడితో పశువుల కాపర్లు, రైతులు, గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

రూ. 2.26 కోట్లకు కుచ్చుటోపీ.. పరారీలో వ్యాపారి

చిగురుమామిడి,స్టెంబరు 10: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ప్రవీణ్‌కుమార్ అనే వ్యాపారి ఇదే గ్రామానికి చెందిన రైతులు, ఇతర ప్రైవేట్ వ్యక్తులు 98 మందికి 2.26 కోట్ల రూపాయల కుచ్చు టోపీ పెట్టిన వ్యాపారి పరారీలో ఉన్నాడు. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని సంవత్సరాలుగా అడ్తి వ్యాపారం చేస్తూ అనేక మందికి నమ్మకంగా ఉండేవాడు. తిమ్మాపూర్ మండలం రేణికుంట, మొగిళిపాలెం, పర్లపల్లి, బెజ్జంకి మండలం దేవక్కపల్లి, ఇదే మండలం రేకొండ , సిద్దిపేట పట్టణానికి చెందిన వ్యక్తులు వరి ధాన్యం వ్యాపారికి విక్రయించారు. తమ వద్ద ఉన్న డబ్బులను కూడా అతనికి వడ్డీకి ఇచ్చారు. నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని 2 కోట్ల 26 లక్షల రూపాయాలకు ఎగనామం పెట్టి వ్యాపారి పరారీ అయ్యాడు. వ్యాపారికి ధాన్యం, డబ్బులు ఇచ్చిన వారు ఆందోళనకు గురయ్యారు. వ్యాపారిపై జిల్లా పోలీస్ కమిషనర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇందులో కొంత మంది తమ కూతుళ్ల వివాహాలకు, మరికొంత మంది పిల్లల చదువుల కోసం, అనేక మంది తమ డబ్బు భద్రంగా ఉంటుందని వ్యాపారి వద్ద పెట్టినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20 సంవత్సరాల క్రితం మూతపడిన అయిల్ మిల్లులో తాను చేసిన వ్యాపారంలో నష్టం వచ్చిందని సదరు వ్యాపారి ప్రవీణ్‌కుమార్ కోర్టును సంప్రదించి తమకు నోటీస్ పంపించారని బాధితులు అంటున్నారు. సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ప్రవీణ్‌కుమార్ ఇంటికి తాళం వేసి ఉన్నదని గ్రామస్థులు తెలిపారు. వ్యాపారి సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ ఉందని అంటున్నారు. వ్యాపారికి ఇద్దరు కుమారులు, భార్య ఉంది.

ఆంగ్ల నిఘంటువుల పంపిణీ

కమాన్‌పూర్, సెప్టెంబరు 10 : మండలంలోని జూలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగరాజు విద్యార్థులకు ఆంగ్ల నిఘంటువులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కను నాటారు. హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 10: గోదావరిఖని గాంధీనగర్‌లోని బాలల సంరక్షణ కేంద్రంలో మంగళవారం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకల శ్రీధర్‌యాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ యువజన నాయకులు మొలుగూరి మహేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఆశ్రమంలోని పిల్లలకు నోట్‌బుక్స్, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. చెన్నూరి నాగరాజు, పొడిశెట్టి మణి దీప్, అరక సాయియాదవ్, ఆరెపల్లి రమేష్, చింత స్వరణ్, సుందిళ్ల సూర్య, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 10: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కనకయ్య, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ కట్కూరి శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రియదర్శిని, యశోద, జగదీశ్వరి, రామ్మూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం



సదాశివ

ఓదెల, సెప్టెంబరు 10 : మండలంలోని కనగర్తి అనుబంధ గ్రామం కందులపల్లికి చెందిన కందుల సదాశివ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ సదాశివను రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంపై ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య, పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మొక్కల రక్షణకు చర్యలు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 10 : రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల రక్షణకు చర్యలు చేపడుతున్నట్లు ఈజీఎస్ జేఈ రాజయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మారేడుగొండ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కల రక్షణకు ముళ్ల పొదలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెంట ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

నాంసానిపల్లిలో గౌడ సంఘం ఎన్నికలు

ఓదెల, సెప్టెంబరు 10 : మండలంలోని నాంసానిపల్లిలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షునిగా వీరగోని ఎల్లయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వీరగోని రవి గౌడ్, సభ్యులుగా శివప్రసాద్, రమేష్, సంపత్, రాజయ్య, కుమారస్వామి, తిరుపతి ఎన్నికయ్యారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎన్నికైన వారిని సన్మానించారు.

కొలనూర్‌లో దోమల నివారణకు చర్యలు

ఓదెల, సెప్టెంబరు 10 : మండలంలోని కొలనూర్‌లో మంగళవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండటంతో ప్రతివీధిలో దోమలు అధికమయ్యాయి. దీంతో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ప్రతి వీధిలో ఫాగింగ్ చేశారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎలిగేడు, సెప్టెంబరు 10: మండలంలోని 12గ్రామాల్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జూలపల్లి ఎస్సై శ్రీధర్ గణేష్ మండప నిర్వాహకులకు సూచించారు. మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వివిధ గ్రామాల్లో వినాయక మండప నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు అందించారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

కమాన్‌పూర్, సెప్టెంబరు 10 : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ కొట్టె ప్రసాద్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి-మంథని ప్రధాన రహదారి వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ లైసెన్సు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

ఉత్సవ కమిటీ కార్యవర్గం

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 10: గోదావరిఖని మార్కండేయకాలనీలోని శ్రీ మార్కండేయ శివాలయం ఉత్సవ కమిటీని మంగళవారం శాశ్వత సంక్షేమ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు పొరండ్ల ఆనందం, మంచికట్ల వెంకటస్వామి ప్రకటించారు. కమిటీ అధ్యక్షులుగా మంచికట్ల బిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా బండారి రాయమల్లు, కోశాధికారిగా గడ్డం రవి గౌడ్‌లను నియమించారు. వీరితో పాటు పలువురు కార్యకర్త సభ్యులను ప్రకటించారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళులు



ఖనిలో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు



మంథనిలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ రమ, కాంగ్రెస్ నేతలు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 10:తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్థంతి సందర్భంగా మంగళవారం గోదావరిఖని గాంధీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల ఏడుకొండలు నివాళులర్పించారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, గుండబోయిన ఓదెలు, నరెడ్డి స్వరాజ్యం, పి.రాజనర్సు, వీరేందర్, చిటికెల రాజలింగం, సుందిళ్ల స్వామి పాల్గొన్నారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని కుక్కలగూడూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులు నివాళులు అర్పించి వర్థంతిని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు నగునూరి రమేష్,యూత్ అధ్యక్షుడు కట్కూరి చంద్రశేఖర్, కట్కూరి రాజయ్య, ఓగేటి రమేష్, దొమ్మటి వెంకటి, కట్కూరి శివ తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్థంతి వేడుకలు జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రామ్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు గడప కృష్ణమూర్తి, ఓయూ ఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, జంగపల్లి కనకయ్య, జంగపల్లి అజయ్, తోట రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సుల్తానాబాద్ : మండల రజక సంఘం అధ్యక్షుడు నిట్టూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, రజక సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమతాకృష్ణ, నూర శ్యామ్, రజక సంఘ పట్టణ అధ్యక్షుడు నిట్టూరి రాజేశం, నిట్టూరి మైసయ్య, నిట్టూరి అంజయ్య, తోటపల్లి సంతోష్, నిట్టూరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండలంలోని అంబేద్కర్ చౌక్‌లో మంగళవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ వర్థంతి వేడుకలను రజకులు ఘనంగా నిర్వహించారు. ముంజంపల్లి కొమురయ్య, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, బూర్ల వెంకటసత్యం, న్యాతరి పోచయ్య, సంపత్, లచ్చయ్య, ముత్యాలు, రాజేశం, వంశీ, ఓదెలు, రమేష్, సాయి, నారాయణ, రాజేశం పాల్గొన్నారు.

ధర్మారం : చాకలి ఐలమ్మ వర్థంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని ఆమె విగ్రహానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటుచేసి వినాయక మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

మంథని : చాకలి ఐలమ్మ వర్థంతి సందర్భంగా ఆమె విగ్రహానికి రజక సేవా సంఘం నేతలు, బీఆర్‌ఎస్ మండల, టౌన్ అధ్యక్షులు ఏగోళపు శంకర్‌గౌడ్, బత్తుల సత్యనారాయణ వేర్వేరుగా పూలమాల వేసి నివాళుల్పించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమసురేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, కాంగ్రెస్ నేతలు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పైడాకుల నాగరాజు, పోతరాజు శ్రీనివాస్, కొల్లూరి సమ్మయ్య, కొండపర్తి బాపు, శంకర్, చంద్రగిరి లింగయ్య, కాయితి సమ్మయ్య, వేముల లక్ష్మయ్య, ఆడిచర్ల సమ్మయ్య, మంథని లక్ష్మణ్, గొబ్బూరి వంశీ, ఆసీఫ్‌ఖాన్, గోటికార్ కిషన్ జీ, పేరవేన లింగయ్యయాదవ్‌లు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని పందిళ్లలో చాకలి ఐలమ్మ వర్థంతి సందర్భంగా మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా యూత్ అధ్యక్షుడు దర్శుల రవి, పంచాయతీ కార్యదర్శి మహేందర్, మాజీ ఉపసర్పంచ్ ఇల్లందుల రమేష్‌గౌడ్, దబ్బేట శ్రీకాంత్, రామ్మూర్తి, శ్రీనివాస్, హరీష్, భూమేష్, హరీష్, రాజు, నవీన్, చంద్రయ్య, అనిల్, దేవేందర్, కోమల్‌రెడ్డి, అన్వర్, సమ్మయ్య, రమేష్, సురేష్, పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ : ఆత్మగౌరవానికి, తెగింపునకు నిదర్శనం చాకలి ఐలమ్మ, రజాకార్లను, విసునూరు దొరలను ఎదురించి కొట్లాడిందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖనిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్థంతి నిర్వహించారు. జిల్లా రజక సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్, అడిషనల్ డీసీపీ సీ రాజు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు బొంతల రాజేష్, కార్పొరేటర్ ముస్తాఫా, కాంగ్రెస్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.



ధర్మారంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న కొప్పుల ఈశ్వర్



సుల్తానాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న నాయకులు

వైన్‌షాప్ చోరీ కేసులో దొంగల అరెస్టు

చెన్నూరు, సెప్టెంబరు 10: పది రోజుల క్రితం కోటపల్లి మండలం పారుపెల్లి వైన్‌షాపులో దొంగతనానికి పాల్పడిన ఇరువురు దొంగలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈనెల 1న రాత్రి ఎంఎస్ వైన్‌షాపు తలు పులు పగులగొట్టిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. షాపు వెనకభాగంలోని తలుపులు పగులగొట్టిన దొంగలు రూ.1,43,280 విలువగల మద్యం బాటిళ్లు, సీసీ కెమెరా, రూ.31,370 నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు యజమాని మహేందర్ ఫిర్యాదు చేశాడు. సర్వాయిపేట ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో సర్వాయిపేటకు చెందిన మేకల లక్ష్మణ్, కమాన్‌పూర్ మండలం పెంచికలపేట గ్రామానికి చెందిన కోటకుమార్‌లను విచారించగా వైన్‌షాపులో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. మేకల లక్ష్మణ్ కొంత కాలంగా 8 ఇంక్లైన్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి పెంచికలపేటకు చెందిన కోట కుమార్, గండి కోట దర్మేందర్, కలకుంట బన్నీలతో పరిచయం ఏర్పడిందన్నారు. ఈ నెల 1న రాత్రి చెన్నూరు పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో ఆటోను దొంగలించారు. ఆటోలో పారుపెల్లికి వెళ్లి వైన్‌షాపులో దొంగతనం చేశారన్నారు. చోరీ చేసిన మద్యాన్ని గోదావరిఖని,8 ఇంక్లైన్‌లో అమ్ముకున్నా రన్నారు. చోరీ చేసిన ఆటో, మేకల లక్ష్మణ్, కుమార్‌లను అరెస్ట్ చేశామని, మరో ఇద్దరు నిందితులు కోట దర్మేందర్, బన్నిలు పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. చెన్నూరు సీఐ రవీందర్,ఎస్‌ఐ శ్వేత, కోటపల్లి ఎస్‌ఐ రాజేందర్‌లు పాల్గొన్నారు.

వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 10 : సుల్తానాబాద్ పట్టణంలోని గౌడ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం మంగళవారం గోపూజలు నిర్వహించారు. ప్రతి ఏటా ఈ గణపతి మండపం వద్ద గోపూజ చేయడం ఆనవాయితీ. మహిళలు గోమాతకు ప్రత్యేక పూజ నిర్వహించి నూతన వస్త్రాలు సమర్పించి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మాజీ సర్పంచ్‌అంతటి పుష్పలత గౌడ్ ,బత్తిని రేణుక,మంద మధురమ్మ, అంతటి రాజేశ్వరి, పోడేటి స్వప్న, మ్యాడుగొని విజయ, కెక్కర్ల నందిని గణేష్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి, సెప్టెంబరు 10: మంగళవారం కేశోరాం సిమెంటు కంపెనీ ఆవరణలో గణనాథునికి జరిగిన ప్రత్యేక పూజలో, అన్నదానం కార్యక్రమంలో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక్ హరి పాల్గొన్నారు. ప్రధాన కార్యధర్శి మాదాసు శ్రీనివాస్, కంపెనీ అధికారులు, పలువురు కార్మికులున్నారు.

అల్పాహారం పంపిణీ

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 10: రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని నిరుపేద కూలీలకు ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం హనుమాన్ నగర్‌లో ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. క్లబ్ జోనల్‌చైర్మన్ కే రాజేందర్, మీల్స్ అన్ వీల్స్ కోఆర్డినేటర్ బంక రామస్వామి, సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ లయన్స్‌క్లబ్ సభ్యులు గుండా వీరేశం, సుధాకర్, గోపా ల్‌రావు పాల్గొన్నారు.

గణపతి పూజలో పాల్గొన్న దాసరి ఉష

సుల్తానాబాద్, సెప్టెంబరు 10 : సుల్తానాబాద్ పట్టణంలోని నాలుగో వార్డు జవహర్ నగర్ తదితర వినాయక మండపాల వద్ద టీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకురాలు దాసరి ఉష పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకురాలు కొండా రజిత, అముదాల అరుణ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం తీసుకోవాలి

ఎలిగేడు, సెప్టెంబరు 10 : తెలంగాణలో 35 ఏళ్లలోపు యువత కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అవినీతిపై విచారణ జరపాలి'

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు10: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని సీపీఎమ్ ఏరియా కార్యదర్శి సీపెల్లి రవీందర్ మంగళవారం కలెక్టర్ కార్యాలయ ఏవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపెల్లి రవీందర్ మాట్లాడుతూ పెద్దపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రార్ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యాలయ అవసర నిమిత్తం వస్తున్న ప్రజల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారని మా దృష్టికి వచ్చిందన్నారు. డబ్బులు ఇవ్వని డాక్యుమెంట్లను పక్కనబెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రిజిస్ట్రార్ అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్ల సందీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

జూలపల్లి, సెప్టెంబరు 10: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకంగా దృష్టిసారించి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్ గ్రామాల్లో మంగళవారం డీపీవో సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కల పరిశీలన

పాలకుర్తి, సెప్టెంబరు 10: మండలం పరిధిలోని పుట్నూర్, రామరావుపల్లె గ్రామాల మధ్య రహదారిపై నాటిన మొక్కలను, కంచెలను జాతీయ ఉపాధిహామీ పథకం అధికారులు మంగళవారం పరిశీలించారు. ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో లెక్కలకే పరిమితమవుతున్న వన మహోత్సవం అనే కథనంపై అధికారులు స్పందించారు. టీఏ సమ్మయ్య తదితరులు సంఘటన స్థలాన్ని సందర్శించి మొక్కలకు కంచెలు లేని చోట కంచెలు నాటించారు. కంచెలు ఉండి మొక్కలు లేని చోట మొక్కలు నాటించి వాటి సంరక్షణకు పాటు పడాలని సూచించారు.

పంటల పరిశీలన



జామతోటను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం బృందం

రామగిరి, సెప్టెంబరు 10: కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి ఖిల్లాకు చెందిన బృందం మండలంలోని రత్నాపూర్, ఆదివారంపేట గ్రామంలోని వివిధ పంటలను సందర్శించింది. ఆదివారంపేటలోని జామ తోటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కొన్ని రోజులుగా అధిక వర్షాలు కురవడం వలన పొలాలను ఆరబెట్టాల్సిందిగా శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి జిల్లా శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ శ్రీనివాస్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అండ్ హెడ్ డాక్టర్ వై వెంకన్న సస్యరక్షణ శాస్త్రవేత్త, డాక్టర్ బి భాస్కరరావు, ఉద్యాన శాస్త్రవేత్త మరియు డాక్టర్ కిరణ్ పిల్లి మృతిక శాస్త్రవేత్త పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ముత్తారం, సెప్టెంబరు 10: సాధారణ బదిలీల్లో ట్రాన్స్‌ఫర్ అయిన ఉపాధ్యాయుల స్థానంలో విద్యావలంటీర్స్‌ను నియమించి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టి.పి.యు.ఎస్) జిల్లా అధ్యక్షులు ముస్కుల సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన అన్నిరకాల పెండింగ్ బిల్లులను వెంటనే ప్రభుత్వం క్లియర్ చేయాలని కోరారు. ముత్తారం మండలంలోని వివిధ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు ముదుగంటి సతీష్ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి ములుకల్ల రాజేశ్వర్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రాజేశ్వర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ రెడ్డి పాల్గొన్నారు

రేపు మెగా వైద్య శిబిరం

ముత్తారం, సెప్టెంబరు 10: మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామ పంచాయతీలో ఐటి, పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు గారి ఆదేశానుసారం గ్రామంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజి, మాజీ ఎంపీటీసీ గీతారాణి కోరారు. గురువారం ముత్తారం ప్రభుత్వ వైద్యులు డాక్టర్ అమరేందర్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఆయుష్ శాఖ(హోమియో) డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈఅవకాశాన్ని అడవి శ్రీరాంపూర్ గ్రామ ప్రజలు సద్వినియోగపర్చుకోగలరని కోరారు.

'నకిలీ విలేకరిపై చర్యలు తీసుకోవాలి'

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 10: గోదావరిఖని విఠల్‌నగర్‌లో రేషన్ దుకాణం డీలర్ శివరాత్రి సురేష్‌పై దాడి చేసిన నకిలీ విలేకరి కొత్తపల్లి శివచరణ్‌పై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బండారి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి మద్దెల నర్సయ్య కోరారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డీలర్ సురేష్ సోమవారం బియ్యం పంపిణీ చేస్తున్న సమయంలో శివచరణ్ అనే నకిలీ విలేకరి బెదిరించి దాడి చేయడంతో పాటు, డిజైజర్ యంత్రాన్ని ధ్వంసం చేశాడని వాపోయారు. ఈమేరకు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీలర్లు రాజు, రాజమౌళి, మండల అధ్యక్షుడు ఎలబోతారం శంకర్, ప్రధాన కార్యదర్శి గాండ్ల రవి కుమార్,రంగు అభిలాష్, సారయ్య, కిషన్ రెడ్డి, రాజమౌళి, ప్రకాష్ రెడ్డి, హన్వి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌టీఎఫ్ ధర్మారం మండల శాఖ కార్యవర్గం

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 10: టీఆర్‌టీఎఫ్ ధర్మారం మండల శాఖ కార్యవర్గాన్ని మంగళవారం నియమించారు. మండల శాఖ అధ్యక్షులుగా గుమ్ముల నాగరాజు, ప్రధానకార్యదర్శి ఈగం సంతోష్ కుమార్‌లను నియమించినట్లు జిల్లా శాఖ పేర్కొంది. ఈ మేరకు వారు మెంబర్‌షిప్ క్యాంపయిన్‌లో భాగంగా నూతన కమిటి నియామకం అనంతరం కార్యవర్గాన్ని ప్రకటించారు. అసోసియేట్ అధ్యక్షులుగా సురుకంటి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వైద్య భూమయ్య, మహిళ ఉపాధ్యక్షురాలుగా శ్రీవిద్య, కార్యదర్శులుగా సిహెచ్ తిరుపతి, మల్లిక, స్వప్న, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా వైద్య విఠల్, ప్రేమ్‌సాగర్‌లను కమిటి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా విలక్ష్మీనారాయణ, ఎలిగేడు మండల శాఖ అధ్యక్షులు, పరిశీలకులుగా అశోక్‌కుమార్ రాష్ట్ర కార్యదర్శి వ్యవహరించారు.

జిల్లా పంచాయతీ అధికారిని కలిసిన కారోబార్లు

కమాన్‌పూర్, సెప్టెంబరు 10: పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యను మంగళవారం కమాన్‌పూర్ మండల కారోబార్ల సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బర్ల భూమయ్య, రాచకొండ బీరాజు, నంది శ్రీనివాస్, మంగ సంతోష్, మేడగోని శ్రీనివాస్, సాగర్, నరేష్, పేట కనకయ్య, రామచందర్, మరల రమేష్, సాకేత్, అభి, ఇరుగురాల శంకర్‌లు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 9: మండల కేంద్రంలో నిరుపేద మహిళ మెట్టు సమ్మక్క ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా మృతురాలి కుటుంబానికి కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ జనగామ రవి మంగళవారం ఆర్థిక సహాయం అందించాడు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాన్ని ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 9: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు మంగళవారం ప్రభుత్వ డాక్టర్ శ్రీనివాస్ విద్యార్థుల ఆత్మహత్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాల్లో ఉండి గొప్ప పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, సీహెచ్‌వో సరస్వతి, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి, హెచ్‌ఈ ఓ శ్రీనివాస్, వినీత్ ఏఎన్‌ఎం సరోజన, ఆశా వర్కర్లు భూలక్ష్మి, సరోజన విద్యార్థులు పాల్గొన్నారు.



ఐఎల్‌వో కోఆర్డినేషన్ కమిటీతో జనక్ సమావేశం

- మినిమమ్ వేజెస్ అధ్యయనానికి ప్రతిపాదన



ఐఎల్‌వో కోఆర్డినేషన్ కమిటీలో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

గోదావరిఖని, సెప్టెంబరు 10: కార్మికుల కనీస వేతన సవరణపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎల్‌వో కోఆర్డినేషన్ కమిటీతో సోమవారం హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయంలో మినిమమ్ వేజెస్ సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ సమావేశమయ్యారు. దేశంలో మొదటి సారిగా ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఐఎల్‌వో స్టడీ ప్రకారం మినిమమ్ వేజెస్‌పై అధ్యయనం చేయలేదని, కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే ఐఎల్‌వో సూచనలు తీసుకుని సమగ్రమైన నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని జనక్ తెలిపారు. కార్యక్రమంలో వేజెస్ స్పెషలిస్టు అనూప్, ఐఎల్‌వో డైరెక్టర్ రంజిత్ ప్రకాష్, సెస్ అధికారి అర్చన, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ జాజు, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్, ఐఎన్‌టీయూసీ క్యాంపెనింగ్ ఇన్‌చార్జి వికాస్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీఏ గనిలో ప్రమాదం

రామగిరి సెప్టెంబరు 10: సింగరేణి సంస్థ ఏపీఏ పరిధిలోని ఏఎల్‌పీలో మంగళవారం మొదటి షిఫ్ట్‌లో జరిగిన గని ప్రమాదంలో కుంట రాజేందర్ అనే కార్మికుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గనిలో కోల్‌కట్టర్‌గా పనిచేసే కుంట రాజేందర్ డ్రిల్‌తో కోల్ కటింగ్ పనులు చేపడుతుండగా ప్రమాదం జరగడంతో డెస్పెన్సరీకి తరలించారు. ప్రస్తుతం రాజేందర్ కోలుకుంటున్నాడు.

లాభాల వాటా 38శాతం ఇవ్వాలి

- మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

గోదావరిఖని, సెప్టెంబరు 10: సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం సంస్థ గత సంవత్సరం ఆర్జించిన లాభాల నుంచి 38శాతం లాభాల వాటాను తక్షణమే ప్రకటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సెప్టెంబర్ నెల చివరిలోనే ఈలాభాల వాటాను చెల్లించాలని ఆయన మంగళవారం మీడియాకు పంపిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులతో పాటు సింగరేణిలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సైతం లాభాలవాటా చెల్లించాలని ఆ ప్రకటనలో ప్రభాత్ కోరాడు. అతి తక్కువ వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్న కాంట్రాక్టు కార్మికులు ప్రాథమిక హక్కులను కూడా సింగరేణిలో పొందలేకపోతున్నారని, అత్యధిక పని గంటలు శ్రమిస్తున్నారని, సింగరేణి ఆర్జిస్తున్న లాభాల్లో కాంట్రాక్టు కార్మికుల శ్రమ ఫలితం కూడా ఉందన్నారు. గత పాలకులు కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయనందునే కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఓటమికి గురికావాల్సి వచ్చిందని, కాంగ్రెస్ పాలకులు కూడా ఆ పరిస్థితిని తీసుకచ్చుకోవద్దని ఆయన హెచ్చరించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పాలకులు సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు సొంతింటి పథకం, ఇన్‌కంటాక్స్ పెర్క్స్‌పై చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మారు పేర్ల అంశాన్ని వెంటనే పరిష్కరించాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణిలోని ఐదు జాతీయ కార్మిక సంఘాల నాయకులు కేవలం పైరవీకారులుగా మారారని, కార్మిక హక్కులను పనంగా పెట్టి మేనేజ్‌మెంట్‌కు సహకరిస్తున్నారని ఆరోపించారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ నాయకులు కార్మిక హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. సింగరేణిలో గతంలో లాగా విప్లవ మిలిటెంట్ పోరాటాలను బలోపేతం చేసుకుని కార్మిక సమస్యల పరిష్కారం కోసం కార్మికవర్గం సంసిద్ధం కావాలని అందులో ఆయన కోరారు.

ఇందారం 1ఏ గనిలో కార్మికుడి మృతి

- గాలి సరఫరా లేకపోవడమే కారణమంటూ ఆందోళన



శ్రీనివాస్(ఫైల్)

జైపూర్, సెప్టెంబరు 10: మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం 1ఏ బొగ్గు గనిలో మంగళవారం మొదటి షిఫ్టు విధులు నిర్వహిస్తున్న జనరల్ మజ్దూర్ ఎలవేని శ్రీనివాస్ (37) మృతి చెందాడు. పని స్థలంలో గాలి సరఫరా లేకపోవడంతోనే శ్రీనివాస్ మృతి చెందాడని, గని ప్రమాదంగా గుర్తించాలని కార్మికులు, కార్మికసంఘాల నాయకులు గనిపై ధర్నా చేపట్టారు. శ్రీనివాస్‌తో పాటు పలువురు కార్మికులు మొదటి షిఫ్టు విధుల్లో భాగంగా గనిలోని రిటర్న్ జాలి వద్ద 35డీ ఆఫ్ 4లెవెల్ పని స్థలంలో విధులు నిర్వహిస్తున్నాడు. 11.30 గంటలకు మేషన్ పనిచేస్తున్న శ్రీనివాస్ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. కొద్ది సేపటికి పని స్థలంలోనే మృతిచెందాడని కార్మికులు పేర్కొన్నారు. శ్రీనివాస్‌ను హుటాహుటిన ప్రైవేటు అంబులెన్స్‌లో రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించామని, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని అధికారులు పేర్కొన్నారు. పని స్థలంలో గాలి సక్రమంగా లేకపోవడంతోనే కార్మికుడు మృతిచెందాడని, గని ప్రమాదంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ హెచ్‌ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, కార్మికులు ధర్నాకు దిగారు. ఏరియా ఆసుపత్రి వద్ద శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరించేందుకు వెళ్తుండగా అంబులెన్స్ ఎదుట ఆందోళన చేపట్టారు.

కాగా, మృతుడు శ్రీనివాస్ కుటుంబం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటోంది. ఇందారం 1ఏ గని పని స్థలంలో గాలి సరఫరా లేకపోవడంతోనే తన భర్త శ్రీనివాస్ మృతిచెందాడని, దీనిపై విచారణ చేయాలని మృతుడి భార్య అనిత జైపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూసేకరణ అభ్యంతరాలను పరిష్కరించాలి

ఫైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 10: రామగిరి మండలం సుందిల్లలో సింగరేణి భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రాంతాన్ని మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్‌తో కలిసి పరిశీలించారు. సింగరేణి ఆర్జీ-1 పరిధిలో 49 ఎకరాల పట్టా భూమి 269 ఎకరాల ప్రభుత్వ భూమిని సింగరేణికి లీజుకు ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ భూముల్లో పొజిషన్‌లో ఉంటూ సాగు చేసుకుంటున్నట్టు కొందరు రైతులు అందించిన దరఖాస్తుల మేరకు ఎంజాయ్మెంట్ సర్వే క్షేత్రస్థాయిలో కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సర్వే ఫలితాలను నోటీసు బోర్డుపై అతికించి, అభ్యంతరాలు ఉంటే స్వీకరించి పరిష్కరించాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు గంగయ్య, హనుమానాయక్, అంతర్గాం తహసీల్దార్ సంబంధిత అధికారులు ఉన్నారు.